
# సొగసు చూడతరమా!

విక్రమరావ్ డల్లాస్‌లోని 'నింఫాస్' మెక్సికన్ రెస్టారెంట్‌లో నించి బయటకు వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలు దాటింది. చలికాలం అవటంవల్ల, ఎనిమిది గంటలకే బాగా చలిగా వుంది. బహుశా ఫ్రీజింగ్ పాయింట్ మీద, ఒకటి రెండు డిగ్రీలు ఎక్కువ వుందేమో టెంపరేచర్. వాతావరణం ఫ్రీజింగ్ టెంపరేచర్ దగ్గరకు వచ్చేటప్పుడు, గాలిలో ఒక విధమైన మార్పు, వాసన వస్తుంది. విక్రమరావ్‌కి అదంటే ఇష్టం.

"సరే ఉంటాం గురూ - జాగ్రత్తగా డ్రెయివ్ చేయి - నిద్రపోకు" అన్నాడు ప్రకాష్, షేక్‌హేండ్ ఇస్తూ.

"పీకలదాకా 'ఎంఛిలాడాలు' పెట్టించి, నిద్రపోవద్దంటే ఎలా? అసలే మూడున్నర గంటల ప్రయాణం" - నవ్వుతూనే అన్నాడు విక్రమరావ్. మెక్సికన్ రెస్టారెంట్‌లో, నాచో చిప్సు, పికాంటే సాస్, తర్వాత ఎంఛిలాడాలు - మన భోజనం లాగానే హెవీ స్టఫ్.



లక్ష్మి అన్నది - "సునీతని అడిగానని చెప్పండి - ఈసారి ఇద్దరూ రండి!"

విక్రమరావ్, హ్యూస్టన్ నించి డల్లాస్‌కి, ఆ రోజు ఆఫీసు పని మీద వచ్చాడు. పని పూర్తిచేసుకుని, ముందే అనుకున్నట్టుగా, 'నింఫాస్' దగ్గర పాత మిత్రుడూ, కాకినాడ ఇంజనీరింగ్ కాలేజీలో కలిసి చదివిన ప్రకాష్‌నీ, వాళ్లావిడ లక్ష్మినీ కలిసాడు. డల్లాస్ నించి, హ్యూస్టన్ 200 మైళ్ళ పైన వుంటుంది. అంటే దాదాపు మూడున్నర గంటల ప్రయాణం అన్నమాట. పన్నెండు గంటల లోపలన్నా చేరితే బాగుంటుంది అనుకున్నాడు విక్రమరావ్, ప్రకాష్ లక్ష్మిల దగ్గర శెలవు తీసుకుంటూ.

కారులో బాగా చల్లగా వుంది. హీటర్ ఆన్ చేసి, కాసేపు చేతులు 'వెంట్' దగ్గర వుంచాడు. గ్లవ్స్ తీసి, చేతులకు వేసుకుని, పార్కింగ్ లాట్‌లో నించి బయటకు



వచ్చాడు. ఇండియా నించి ఈ మధ్యనే వాళ్ళ తమ్ముడు రికార్డు చేసి పంపించిన పాటల కేసెట్ టేప్స్ వున్నాయి పక్కనే. ఘంటసాల, రాజాల పాత పాటలతోపాటు, కొన్ని క్రొత్త పాటలు కలిపి రికార్డు చేసిన టేప్ అది. వాళ్ళ తమ్ముడికి విక్రమరావ్ టేస్ట్ చాలా బాగా తెలుసు. అందుకే అన్నీ అతనికి నచ్చిన పాటలే వున్నాయి. వాటిలో 'మిస్సమ్మ'లో పాటలు రాజా హాయిగా పాడుతున్నాడు.

విక్రమరావ్ కారుని, ఇంటర్ స్టేట్ 45 ఫ్రీవే మీదకు ఎక్కించి, హ్యూస్టన్ వేపు త్రిప్పి, కారు వేగం పెంచాడు. మొత్తం పన్నెండు లేన్లు వున్నాయి డల్లాస్‌లో ఆ ఫ్రీవే మీద. ఆరు లైన్లు నార్త్‌కి వెళ్లేవి, ఆరు లైన్లు సౌత్‌కి వెళ్ళేవి. ఈ ఫ్రీవేలు, హైవేలు చూసినప్పుడల్లా, ఎన్నో సంవత్సరాల నించీ అమెరికాలో వున్నా ఏదో వింత చూస్తున్నట్టు వుంటుంది. ఇంత చక్కటి రోడ్లు, ప్రపంచంలో యింకే దేశంలోనూ లేవేమో. ఫ్రీవేలు, నెంబర్లు 5, 15, 25 ... అలా 95 దాకా అమెరికాలోని ఉత్తర ప్రదేశాల నించి, దక్షిణ ప్రదేశాల వరకు ఉంటాయి. ఒకచోట ఫ్రీవే ఎక్కితే, దారిలో ఇంకెక్కడా సిగ్నల్ లైట్లు కానీ, స్టాప్ సైనులు కానీ వుండవు. అందుకే వాటిని ఫ్రీవేలు అంటారు. అలాగే ఫ్రీవే నెంబర్లు 10, 20 30 ... అలా 90 దాకా అమెరికాలోని తూర్పు ప్రదేశాల నించి పశ్చిమ ప్రదేశాల వరకు వెడతాయి. కొన్ని ఫ్రీవేలు దాదాపు రెండు వేల ఐదు వందల మైళ్ళు పొడుగు వున్నాయంటే ఆశ్చర్యంగా వుంటుంది. అందులో కొన్ని చోట్ల, రెండు మూడు ఫ్రీవేలు, ఒకదాని మీద నించి ఒకటి కట్టిన తీరు చూస్తే విభ్రాంతి కలుగుతుంది. ఈ ఆలోచన వచ్చే సమయానికి, విక్రమరావ్ ఫ్రీవే 45, ఇంకొక రెండు ఫ్రీవేలు కలిసే చోటుకు వచ్చాడు. అదొక గొప్ప ఇంజనీరింగ్ స్ట్రక్చర్. చాలా డబ్బు ఖర్చు పెట్టటం, ఏ మాత్రం కల్తీ సామాను వాడకుండా, చాల పకడ్బందీగా కట్టడం,

అలాంటి కట్టడాల వలన రవాణా సౌకర్యాలు పెంచి, దేశంలో ఉత్పత్తిని పెంచటం, అమెరికన్లకు చేతనయినట్టు, మిగతా దేశాల్లో కనపడదు.

కారు డల్లాస్ డౌన్ టౌన్‌లో నించి, ఫ్రీవే మీద గంటకు 65 మైళ్ళ వేగంతో వెడుతున్నది. డల్లాస్ స్కైలైన్ చాలా బాగుంటుంది. ఎన్నో బిల్డింగ్‌లు రకరకాల ఎత్తులతో, ఎన్నో అంతస్థులతో, రంగు రంగుల లైట్లతో, కళ్ళు చెదిరేలా వుంటుంది. అక్కడే ఒక రివాల్వింగ్ రెస్టారెంటు. 50 అంతస్థుల ఎత్తున, నెమ్మదిగా తిరుగుతూ, అక్కడ కడుపు నింపుకునేవాళ్ళకు కన్నుల విందు కూడా చేస్తుంటుంది. అక్కడికి దగ్గరలోనే జాన్ కెన్నెడీని హత్య చేసిన చోటు - ఆయన జ్ఞాపకార్థం కట్టిన స్మారక చిహ్నం.

ఊళ్లో డ్రయివ్ చేస్తున్నప్పుడు అటూ ఇటూ లైట్లతో, బిల్డింగ్‌లతో సందడిగా ఉంది. ఊరు దాటగానే కార్లు తప్ప ఇంకేమీ కనపడటం లేదు.

టేప్‌లో బాలసుబ్రహ్మణ్యం - 'సొగసు చూడతరమా' అని చాలా బాగా పాడుతున్నాడు.

డల్లాస్ సిటీ సొగసులు చూస్తూ, ఆ పాట సరిగ్గా విననందున, రీవైండ్ చేసి, ఆ పాట మళ్ళీ వింటున్నాడు విక్రమరావ్. ఆ పాట అంటే అతనికి చాల యిష్టం.

"ఏం విక్రమార్కుడూ! డల్లాస్ సొగసు చూడటం నీ తరం కావటం లేదా!" - ప్రక్కనే మాటలు వినిపించాయి. ఆ మాటలతో పాటు, అమెరికా బేతాళుడు ప్రక్క సీట్లో ప్రత్యక్షం అయాడు.

విక్రమరావ్‌కి, బేతాళుడిని చూడగానే మహదానందమయింది.

"హ్యూస్టన్ దాకా ఒక్కడ్నే ప్రయాణం చేయటం ఎలాగా - బోరు కొడుతుంది అనుకున్నాను. నా అదృష్టం కొద్దీ దాపురించావ్ బేతాళుడూ - థాంక్స్" అన్నాడు విక్రమరావ్.

"మరేమనుకున్నావ్ - మన బంధం అలాంటిది" - అన్నాడు బేతాళుడు నవ్వుతూ.

"అవున్లే! అయినా నేను ఇక్కడ వున్నానని నీకెలా తెలిసింది? - నీది లోకల్ రేంజ్ మాత్రమే అనుకున్నాను!"

నవ్వాడు బేతాళుడు - "అలా అని నన్ను అవమానించకు. ఇండియాలో బేతాళుడిగా వున్నాను. ఇక్కడా బేతాళుడిగా వేషం కట్టి నీతో కాలం గడుపుతున్నాను. నువ్వెక్కడికి వెడితే అక్కడికి వెళ్ళగలిగే నాకు అదొక పెద్ద పని కాదు. నువ్వు కాలక్షేపం ఎలా చేయాలా అనుకోగానే నాకు తెలిసింది. వెంటనే వచ్చేశాను -"

"థాంక్స్ ఎగైన్" అన్నాడు విక్రమరావ్.

"ఏమిటి - నీలో నువ్వే - అమెరికాని పొగుడుకుంటున్నావ్ - ఇందాకటి నించీ" అడిగాడు బేతాళుడు.

"ఏ విషయానికా విషయమే చెప్పుకోవాలి. అమెరికా అన్ని దేశాలకన్నా ముందుకు

పోయింది. చాల సంపన్నమయిన దేశం. సాంకేతికంగా అన్ని రంగాలలోనూ ఎంతో ఎదిగిపోయింది. నిత్య జీవితావసరాల కోసం వెతుక్కోవలసిన అవసరం లేదు. గొప్ప రోడ్లు, అంతకు మించిన టెలిఫోన్ సౌకర్యాలు, ఏ ఉద్యోగం కానీ, వ్యాపారం కానీ చేయటానికి ఎన్నో అవకాశాలు, చక్కటి విద్యా సౌకర్యాలు ... ఇవన్నీ వాటంతట అవి జరిగేవి కావు. వీటి వెనుక ఎంతో పట్టుదలా, దీక్షా, కార్యదక్షతా, శ్రమా ... ఇవన్నీ తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది" అన్నాడు విక్రమరావ్.

"అవును - నీతో ఏకీభవిస్తున్నాను!" అన్నాడు బేతాళుడు.

సాలోచనగా అన్నాడు విక్రమరావ్ - "అమెరికా సంపన్న దేశం కనక ఇవన్నీ చేయ గలుగుతున్నారు - అన్నవాదం సమంజసం కాదు. ఎందుకంటే ముందు ఆ సంపన్న దేశం అవటానికి ఎంతో కాలం పట్టింది - అక్కడే వున్నది ఈ దేశ ప్రగతి అంతా. అంతేకాదు, అమెరికా కన్నా కూడా ధనవంతమైన దేశాలు సాంకేతికంగా ఇంతగా ఎదగలేదు. జీవితాలను ఇంత సుఖమయం చేసుకోలేదు - వీళ్లు ఎలా చేయగలిగారా అని ఆశ్చర్యం వేస్తుంది!"

"సరే అయితే - మనకి హ్యూస్టన్ వెళ్ళేదాకా చర్చించుకోటానికి ఒక మంచి టాపిక్ దొరికింది. 'అమెరికా ఈనాడు యింత సొగసుగా వుండటానికి కారణాలు ఏమిటి?' అన్న దానిమీద మాట్లాడుకుందాం -" అన్నాడు బేతాళుడు.

"అన్నిటికన్నా ముఖ్యకారణం - నా వుద్దేశ్యంలో ఒకటి వుంది. అది ఇక్కడి మనుష్యుల కార్యదక్షత, నిజాయితీ, పట్టుదలలకు సంబంధించినది. ఇక్కడ అందరూ అలాగే వుంటున్నారా అంటే ... కాదు అని మనకందరికీ తెలుసు. కానీ చాలా మంది అలా వున్నారు. ఉదాహరణకు ఎలక్ట్రిసిటీ నించి, టెలిఫోన్, విమానాల వరకు ఈ దేశంలోనే కనుక్కున్నారు. కొన్ని వందల టన్నుల విమానం గాలిలో 35వేల అడుగుల ఎత్తులో పక్షిలా ఎగరటం ఒకనాటి మానవ మేధస్సుని కలవరపరిచి, ఆ కలని సాంకేతికంగా నిజం చేసి ఈనాటి మానవ ప్రగతికి మార్గం చూపించింది. ఎంతోమంది రాత్రింబవళ్ళు కష్టపడి, కొంతమంది ప్రాణాలు కూడా పోగొట్టుకుని, జ్ఞానాన్వేషణలో విజయం సాధించటానికి, ఎంత పట్టుదలా, సాహసం, నిజాయితీ అవసరమో చూశావా? అలానే నిత్య జీవనంలో, ఎన్నో సాంకేతిక పరికరాలను తయారు చేసుకుని, సుఖంగా బ్రతకటానికి అవకాశాలు కల్పించుకుంటున్నారు -" విక్రమరావ్ ఆగాడు.

కారు అద్దాల మీద తేమ ఫ్రీజ్ అవటం చూసి, విక్రమరావ్ డీఫ్రాస్ట్ ఆన్ చేశాడు. బయట టెంపరేచర్ ఇరవై అయిదు డిగ్రీల ఫారన్ హీట్ చూపిస్తున్నది. అంటే ఫ్రీజింగ్ పాయింట్ కన్నా తక్కువ. లోపల డెబ్బయి డిగ్రీల ఫారన్ హీట్‌కి సెట్ చేశాడు.

బేతాళుడు అన్నాడు - "ఈ దేశం ఇంత పైకి రావటానికి ముఖ్యమైన కారణం నిత్య జీవితంలో ఏ మనిషీ ప్రభుత్వంతో సంబంధం కలిగించుకోవలసిన అవసరం లేదు. అంటే ప్రభుత్వం, ప్రజల అభివృద్ధికీ, శ్రేయస్సుకీ చీటికీ మాటికీ అడ్డం రాదు. కారణం అన్నీ ప్రైవేట్ వ్యక్తుల, సంస్థల ద్వారా జరుగుతాయి కనుక. ఉదాహరణకు - రైళ్ళు, బస్సులు,

విమానాలు, ఏవీ ప్రభుత్వం నడపదు. ఎన్నో కంపెనీలు వీటిని నడపటం వలన, పోటీపడి ప్రయాణీకుల సౌకర్యాలు పెంచుతున్నారు. ధరలు తగ్గిస్తున్నారు. హ్యూస్టన్ నించి న్యూయార్క్‌కి 500 డాలర్లు వసూలు చేసి సగం ఖాళీగా పోవటం కన్నా, 350 డాలర్లు వసూలు చేసి విమానం ఫుల్‌గా పోవటం అటు విమానం కంపెనీ వాళ్ళకీ, ఇటు ప్రయాణీకులకీ లాభం అని గ్రహించిన దేశం యిది. అంతేకాదు ప్రభుత్వం ఏ పరిశ్రమను పెట్టుకోవటానికీ 'లైసెన్స్' ఇవ్వనక్ఖర్లేదు. అది ప్రభుత్వానికి అనవసరం. కంపెనీ నడిపేవాళ్ళదే దాని వల్ల వచ్చే లాభనష్టాల బాధ్యత. ప్రతి వస్తువునీ చాల కంపెనీలు తయారుచేయటం వలన, ఆ వస్తువులు, సర్వీసులు చాల చౌకగా, సులభంగా ఎక్కడపడితే అక్కడ దొరుకుతాయి. కొరత అన్న మాటకు అర్థం లేదు. నాణ్యత ఎక్కువ. ధర తక్కువ -"

"ఇంకొక విషయం. ఇక్కడ కన్స్యూమర్ ఎవేర్‌నెస్ వుంది. సరుకులో ఏ మాత్రం 'సరుకు' లేకపోయినా త్రిప్పి పంపవచ్చు. మీ డబ్బులు మీరు వెనుకకు తీసుకోవచ్చు. ఆ కంపెనీనీ, అమ్మిన షాపునీ కోర్టుకి లాగి, చెవులు పిండి మీ నష్టాన్ని సంపాదించుకోవచ్చు. ఈ కన్స్యూమర్ సంఘాలకు ప్రభుత్వంతో కానీ, రాజకీయ నాయకులతోకానీ సంబంధాలు లేవు. అవి నిజంగా వినిమయదారులు నడిపేవే! అంతేకాదు, ప్రతి నెల పత్రికలు ప్రచురించి, ఏ ఏ వస్తువులు మంచివో, ఏవి ఎందువల్ల నాణ్యమైనవి కావో ప్రజలకు చెబుతారు. అలాగే కంపెనీలు కూడా. వినిమయదారుల అవసరాలను సర్వేల ద్వారా సేకరించి, వాళ్ళకు తగ్గట్టుగా వస్తువులను తయారుచేసి పంపిణీ చేస్తాయి. - 'కష్టమర్ ఈజ్ ఆల్వేస్ రైట్' అని మనసా వాచా పాటించే దేశం ఇది."

బేతాళుడు అంటున్నాడు - "ఇక్కడ ఆర్థికంగా, కంపెనీలు ముందుకు పోవటానికి కారణాలలో యింకోటి - ఉత్పత్తి - అత్యధిక ఉత్పత్తి. ఉత్పత్తిని పెంచినందువలన, అదే పెట్టుబడికి, ఎక్కువ ఆదాయం, లాభాలు. అమెరికాలో అమ్మగలిగినన్ని అమ్మి, మిగతావి ఏ దేశంలో మార్కెట్ వుంటే ఆ దేశానికి ఎగుమతి చేస్తారు. ఇక్కడ ప్రభుత్వం - మీరు యిన్ని వస్తువులు మాత్రమే చేయాలి - ఇంతకు మించి చేయకూడదు అని ఆంక్షలు పెట్టదు. అది ప్రభుత్వానికి అనవసరం. పిండి కొద్దీ రొట్టె. ఎవరి మార్కెట్, మార్కెటింగ్ పద్ధతులు వాళ్ళవి. రోజుకి వెయ్యి కంప్యూటర్లు తయారుచేసి, అమ్మి, ఒక్కొక్క దానిమీద 30 శాతం లాభం సంపాదించటం కన్నా, నాలుగువేల కంప్యూటర్లని చౌకగా అమ్మి, 15 శాతం లాభాలు సంపాదించే ఆర్థిక సిద్ధాంతం యిక్కడ. దానివల్ల లాభాలు పెరుగుతాయి, ఉద్యోగాలు పెరుగుతాయి - దేశ ఆర్థిక పరిస్థితీ బాగుంటుంది -"

విక్రమరావ్ అన్నాడు - "అంతే కాదు - నేను ఈ దేశంలో వున్న ఇరవై ఏళ్ళలోనూ, ఏ కంపెనీ సమ్మె వలన ఉత్పత్తిని కోల్పోయినట్టు వినలేదు. సమ్మెలు యిక్కడ కూడా చేస్తారు. చాల తక్కువ. సమ్మె చేసినా ఉద్యోగులు కంపెనీ బయట బోర్డులు పట్టుకుని తిరుగుతారు. కానీ వాళ్ళకు, పని చేయటానికి లోపలకు వెళ్ళే మిగతా వాళ్ళను ఆపటానికి అధికారం లేదు. ఎవరి యిష్టం వాళ్ళది. ఆ కంపెనీ అన్యాయంగా ప్రవర్తిస్తే కోర్టుకు వెళ్ళవచ్చు.

కోర్టులో తీర్పులు పనివాళ్ళకు అనుకూలంగా రావటం కూడా మామూలే! - రాజకీయపరంగా సమ్మెలను ప్రోత్సహించటం కనీ వినీ ఎరగం. నేరం కూడాను. ఒక్క రోజు ఒక్క కంపెనీలో ఉత్పత్తి ఆగిపోతే, దేశ ప్రగతి వెనుక పడిపోతున్నంత బాధపడతారు! కంపెనీ మీద కోర్టు వెళ్ళటం గురించి, తర్వాతి కథలో చెప్పుకుందాం బేతాళుడూ"-

"ముందు ఈ కథ పూర్తవనీ ఎలా పూర్తి చేద్దామంటావ్?" బేతాళుడు అడిగాడు.

విక్రమరావ్, బేతాళుడ్ని ఆగమని సంజ్ఞ చేశాడు. కారు డేష్ బోర్డులోని కంప్యూటర్‌లో స్విచ్ నొక్కాడు. హ్యూస్టన్ యింకా వంద మైళ్ళు వుందని చూపించింది కంప్యూటర్. గంటా ఏభయి నిమిషాలు పడుతుందనీ, కారులో పెట్రోలు యింకా రెండు వందల మైళ్ళు వస్తుందని కూడా చూపించింది.

"చూశావా - హ్యూస్టన్ పోవటానికి ఇంకా చాల టైమ్ వుంది. అందుకని ఈ కథను అప్పుడే ముగించవద్దు. అంతే కాదు, నేను చెప్పవలసినవి యింకా చాల వున్నాయి - కనుక తొందరపడకు" అన్నాడు విక్రమరావ్.

"నాకు తెలుసులేవయ్యా విక్రమార్కుడూ - ఊరికే నిన్ను పరీక్ష చేస్తున్నానంతే -" అన్నాడు బేతాళుడు.

"ఇక్కడ టీ.వీ., రేడియో, పేపర్లూ ప్రైవేటు సంస్థలు నడపటం వలన, రాజకీయ నాయకుల, ప్రభుత్వోద్యోగుల బండారం అంతా బయటపెడతాయి. వాళ్ళని ప్రత్యక్షంగా టీవీలోనూ, రేడియోలోనూ ఇంటర్వ్యూ చేసి అన్ని నిజాలు బయటకు కక్కిస్తారు. నిక్సన్ చేసిన వాటర్ గేట్ ఘోరాలు బయటపెట్టి, దేశ ప్రెసిడెంట్ అయినా లెఖ్కచేయక క్రిందకు దించారు కదా -" అన్నాడు బేతాళుడు, విక్రమార్కుడికి కాస్త ఇంధనం యిస్తూ.

"నాకు నచ్చిన యింకొక విషయం ఏమిటంటే - ఇక్కడి మనుష్యులు ఒక విధమైన బాధ్యత ఫీల్ అవుతారు. దేశంలో, సమాజంలో, వాళ్ళు ఒక భాగం అనీ, వాళ్ళ వంతు వాళ్ళు చేయటం అవసరం అనీ భావిస్తారు. ఉదాహరణకు - మనం లోకల్ షాపింగ్ చేయటానికి వెళ్ళినప్పుడు చూస్తుంటాం ఏ కుర్రవాడో క్రింద పడేసిన చాక్‌లెట్‌కి చుట్టే కాగితం నున్నగా మెరుస్తుంటే నేల మీద పడివుంటుంది. ఎవరు చూస్తే వాళ్ళు వెంటనే దాన్ని తీసి గార్బేజ్ డబ్బాలో పడేస్తారు. ఇది ప్రతి చోటా కనపడే అతి సామాన్యమైన దృశ్యం. అలాగే మా యింటి ముందరి రోడ్డుని పదేళ్ళ నించీ చూస్తున్నాను, ఏ ప్రభుత్వం వాళ్ళూ వచ్చి శుభ్రం చేయలేదు. చేయరు కూడాను. కానీ చాలా శుభ్రంగా వుంటుంది. కారణం ఎవరి యింటి ముందు వాళ్ళు, శుభ్రంగా వుంచుతారు. వాళ్ళు ఏ కాగితాలూ లాన్‌లో కానీ, రోడ్డు మీద కానీ పారేయరు. ఒకవేళ ఏదన్నా కాగితం ఎగిరివస్తే దాన్ని ఏరి వాళ్ళ చెత్తడబ్బాలో పడేస్తారు. వారానికోసారి వాళ్ళ యింటికి వచ్చి, ప్రైవేటు కంపెనీవారి చెత్త తీసే ట్రక్ చెత్తను తీసుకుపోతుంది. ఎవరి ఇంటి ముందు వాళ్ళు శుభ్రం పాటిస్తే, దేశం అంతా శుభ్రంగా వుంటుంది. టెక్సాస్‌లో రోడ్డు మీద సీసాలు, డబ్బాలు పడేయటం నేరం. రెండు వందల

డాలర్లు దాకా ఫైను కట్టవలసి వస్తుంది!" అన్నాడు విక్రమరావ్, తన ముందరి కారు వెనక బంపర్ మీద హెడ్‌లైట్ కాంతిలో మెరుస్తున్న 'డోంట్ మెస్ విత్ టెక్సాస్' స్టిక్కర్‌ని చూస్తూ.

"నీ ధోరణి చూస్తే, అమెరికా సొగసుల్ని ఎక్కువగా చూస్తున్నావేమో అని నాకు అనుమానం కలుగుతున్నది!" అన్నాడు బేతాళుడు కవ్విస్తూ.

ఒక్క క్షణం ఆలోచించి అన్నాడు విక్రమరావ్ - "అని నేను అనుకోవటం లేదు. ఎందుకంటే ప్రతిచోటా, ప్రతి దేశంలోనూ మంచీ చెడూ వుంటూనే వుంటాయి. అమెరికాలో నేరాలు ఎక్కువ వుండవచ్చు. కొన్ని ఉద్యోగాలలో విదేశీయుల మీద దురభిమానాలు వుండవచ్చు. కానీ మనం దేశ ప్రగతినీ, సాంకేతిక విజయాలనీ, ఆర్థిక సౌభాగ్యాన్నీ గురించి మాట్లాడుకునేటప్పుడు, ఇవన్నీ చాల చిన్న విషయాలుగా మారిపోతాయి. ఉదాహరణకు నాకు యిష్టమైన మామిడికాయ పప్పు తింటున్నప్పుడు, ఆ రుచిని అనుభవించటం నాకిష్టం. దాంట్లో పంటి క్రిందకు వచ్చిన ఒక రాయిని చూసి, ఆ పప్పు రుచిగా లేదనటం భావ్యం కాదు. కానీ కల్తీ గురించి మాట్లాడుకునేటప్పుడు, ఆ రాయిని ఉదహరించటం అవసరం!"

"నీకు తిండి రంధి ఎక్కువయ్యా విక్రమార్కుడూ - నీ ఉదాహరణలు కూడా తిండి సంబంధమే" అన్నాడు బేతాళుడు నవ్వుతూ.

"తిండి అంటే గుర్తుకు వచ్చింది. అమెరికాలో తిండి పుష్కలంగా లభిస్తుంది. చాల చౌక. రాత్రి ఒంటి గంటకు పాలు కావాలన్నా, 24 గంటలు తెరిచి వుంచే షాపులు ఎక్కడ పడితే అక్కడ వున్నాయి. పొలం దున్నటం దగ్గర నించీ, పంట సంచులకెత్తే దాకా, మెషీన్లతో చక చకా పనులు చేసుకుపోతారు. అలాగే పాలు పిండటం, శుభ్రం చేయటం, ప్లాస్టిక్ బాటిల్స్ లోకి నింపటం కూడా యంత్రాలతో నిముషాల మీద జరిగిపోతుంది."

"దానివల్ల మనుషులకు ఉద్యోగాలు పోయే ప్రమాదం వుంది కదా!" బేతాళుడు అమాయకంగా అడిగాననుకున్నాడు కానీ, అతను తన వాదం వినటానికి రెచ్చకొడుతున్నాడని విక్రమార్కుడికి అర్థమయింది.


"అది నిజం కాదు - ఉద్యోగాలు పోవు - పెరుగుతాయి. ఎలాగంటే ఉత్పత్తి పెరుగుతుంది. పెరుగుతున్న ఉత్పత్తి ఎప్పుడూ ఉద్యోగాలను పెంచుతుంది. ఆ మెషీన్లు వాటంతట అవే నడవవు. నడపటానికి మనుషులు కావాలి. ఆ మెషీన్లు తయారు చేయటానికి మనుషులు కావాలి. ఆ మెషీన్లను సర్వీస్ చేయటానికి, రిపేరు చేయటానికి మనుషులు కావాలి. ఆ మెషీన్లకి అవసరమయిన స్టీలు, అల్యూమినియం, ప్లాస్టిక్‌లు తయారుచేయటానికి ఎన్నో పరిశ్రమలు అవసరం. వాటికి మనుషులు కావాలి. ఆ మెషీన్‌లకి అవసరమయే మిగతా భాగాల కోసం మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లాస్టిక్, గ్లాస్ - అన్ని రకాల పరిశ్రమలు ఉత్పత్తిని పెంచాలి. వాటికి మనుషులు కావాలి. ఒక పరిశ్రమ మొదలయిందంటే, దానిని సపోర్టు చేయటానికి ఎన్నో పరిశ్రమలు కుక్క గొడుగుల్లా వస్తాయి. అవి నడపటానికి మనుషులు కావాలి కదా -" అన్నాడు విక్రమార్కుడు.

"అవును - పదిహేనేళ్ళకు పైగా అవుతుంది. ఒక ఇండియన్ పేపర్లో చదివేను. ఆ రోజుల్లో ఇండియాలో పరిశ్రమల శాఖామంత్రి ఫెర్నాండెస్ అనే ముందు చూపులేని ఒక కబోది ఒక మాటన్నాడు 'ఇండియాకి కావలసినది, పరిశ్రమలూ, రాకెట్లూ, కార్లూ, కంప్యూటర్లూ కాదు. మనుష్యులకు తిండి. ప్రభుత్వం చేయవలసింది వాళ్ళకు తిండి పెట్టడం' అని. అంత అజ్ఞాని దేశానికి మంత్రి కావటం, భారతదేశం చేసుకున్న పెద్ద దురదృష్టం. ప్రజలకు ఇవాళ తిండి పెడితే, తిని, మళ్ళీ రేపు వస్తారు. మళ్ళీ రేపు తిండి పెడితే, తిని, ఎల్లుండి మళ్ళీ వస్తారు. అదికాదు వాళ్ళకు యివ్వవలసింది. రోజూ తిండి పెట్టే ఉద్యోగం. ఆ ఉద్యోగం యిస్తే ఏ రోజు తిండి ఆ రోజు వాళ్ళే గర్వంగా కొనుక్కు తింటారు. ఆ ఉద్యోగం పరిశ్రమల వల్లనే వచ్చేది. కంప్యూటర్ల వల్ల ఉద్యోగాలు పోతాయని, పదిహేనేళ్ళ క్రితం ఇండియాలో సమ్మెలు జరిపారు - ఇన్సూరెన్స్ కంపెనీల్లోనూ, బ్యాంక్‌ల్లోనూ. ఈనాడు కంప్యూటర్ల వల్ల ప్రపంచమంతటా ఉత్పత్తి పెరిగింది. వేగం పెరిగింది. జీవితాన్ని సుఖమయం చేస్తున్నారు - అంతేకాదు - ఉద్యోగాలు లక్షల సంఖ్యలో పెరిగిపోయాయి. కంప్యూటర్లు తయారుచేసే ఇంజనీర్లు, టెక్నీషియన్లు, అమ్మేవాళ్ళు, రిపేర్లు చేసేవాళ్ళు, ప్రోగ్రామర్లు, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, వాటిని ఒకచోట నించి ఒక చోటకు తీసుకు వెళ్ళటానికి ట్రక్ కంపెనీలు, ఎయిర్ ఫ్రైయిట్ కంపెనీలు - నమ్మశక్యం కాకుండా పెరిగిపోతున్నాయి. కాకపోతే ఉద్యోగులు కొత్త కొత్త విషయాలు తెలుసుకోవటం, వారి నైపుణ్యాన్ని మారే సాంకేతిక ప్రగతికి అనుగుణంగా మలుచుకోవటం అవసరం. ఎవరు అన్నారో గుర్తులేదు కానీ, జీవితంలో విజయం సాధించాలంటే, మారే పరిస్థితులకు అనుగుణంగా మారమన్నారు. చదువు, జ్ఞాన సముపార్జనకు అంతం లేదు. ఎంత నేర్చుకున్నా తరగని నిధులవి -" బేతాళుడు ఆగాడు.

"దానికీ ఒక ఉదాహరణ యిస్తాను - నేను ఇండియాలో త్రివేండ్రంలో పని చేస్తున్నప్పుడు, అక్కడ సైకిల్ రిక్షాలను బహిష్కారం చేశారు. సైకిల్ రిక్షాలు నడిపేవాళ్ళలో చాలా మంది ఆటోలు, టాక్సీలు నడపటం నేర్చుకుని వాళ్ళ జీవనశైలినీ, స్థాయినీ మార్చుకున్నారు" అన్నాడు విక్రమరావ్.

కారు హ్యూస్టన్ ఇంటర్ కాంటినెంటల్ ఎయిర్ పోర్టు దాటుతున్నది. చలితో పాటు, గాలి కూడా ఎక్కువయింది. కారులో మాత్రం వెచ్చగా వుంది.

విక్రమరావ్ అన్నాడు - "ఇంకొక ముఖ్య విషయం. ఈ దేశం యిలా అభివృద్ధి చెందటానికి కారణం వీళ్ళు ఏ పని చేసినా - మంచి కానీ, చెడుకానీ - ఒకే ఒక్క మనిషి దగ్గరే మొదలవుతుందని గాఢంగా నమ్మటం, ఆచరించటం. అందుకని మనకెందుకులే - లేనిపోని గొడవ అని ఊరుకోరు. అంతేకాదు, తలుచుకున్న ఆ పని చేయటానికి ఎన్ని బాధలున్నా, బాధ్యతలున్నా భరించి, తీసుకుని, ఆ పని నెరవేరుస్తారు. కన్స్యూమర్ మూవ్‌మెంట్‌ని రాల్ఫ్ నాడార్ అలా ప్రారంభించిందే. సాంకేతికరంగంలో, పారిశ్రామికరంగంలో, ఆర్థికరంగంలో, క్రీడారంగంలో ఇలాంటివి బాగా చూస్తుంటాం యిక్కడ. 'ఈ దేశం



నీకేమిచ్చిందన్నది కాదు ముఖ్యం, నీ దేశానికి నువ్వేం యిచ్చావన్నది అవసరం' అన్న నమ్మకం అమెరికాని ముందుకి నడిపిస్తున్నది -"

"సరే - ఒప్పుకున్నానయ్యా విక్రమార్కుడూ! - ఇప్పుడు ఒక ప్రశ్న. మీ దేశం ఇండియా గురించి, ఏవో గొప్పలు చెబుతావు కదా - దీనికి జవాబు చెప్పు ఇండియా ఎందుకు వెనకపడిపోతున్నది? - కొరియా, తైవాన్, చైనా, సింగపూర్ అన్నీ ఆర్థికంగా ఇండియాని మించిపోయాయి. వాటీజ్ రాంగ్? తప్పు ఏమిటి? ఎక్కడ వుంది? తెలిసీ జవాబు చెప్పకపోతే ... నీకు తెలుసు ఏం జరుగుతుందో?"

విక్రమరావ్ తల పూపాడు - తెలుసునన్నట్టుగా. ఒక క్షణం దీర్ఘంగా ఆలోచించాడు.

"జవాబు చెబుతాను. చెప్పేముందర ఒక విషయం చెప్పాలి. ఇండియాని గత ఆరు వందల సంవత్సరాల్లోనూ మూడు రకాల బందిపోట్లు కొల్లగొట్టారు. మొదట్లో మొగలాయీలు వచ్చి మన దేశాన్ని చిన్నాభిన్నం చేసి, సంపదనంతా కొల్లగొట్టారు. వాళ్ళ తరువాత బ్రిటిష్ వాళ్ళు వచ్చి, మిగిలిన మన వనరులు, సంపద దోచుకోవటమే కాక, దేనికి పనికిరాని, పని చేయని ప్రభుత్వ యంత్రాంగ పద్ధతిని మన నెత్తిన రుద్ది, దేశాన్ని ఎన్నో భాగాలుగా విభజించి

గానీ బయటకు పోలేదు. తరువాత మూడో రకం వాళ్ళు మన నాయకులు. రాజకీయ స్వలాభాన్వేషకులు. ఈ మూడు రకాల బందిపోట్లలోకీ అతి ప్రమాదకరమైన శత్రువులు, దేశద్రోహులు. వాళ్ళు దేశాన్ని నంజుకు తినటమే కాకుండా, మొగలాయిలలాగా, బ్రిటిష్ వాళ్ళ లాగా దేశం వదిలిపోరు. ఎందుకంటే వాళ్ళ దేశం ఇండియాయే కనుక. లంచాలతో, బంధుప్రీతితో, కుల, మత, భాషా, ప్రాంతీయాభిమానాలతో దేశాన్ని పిండి పిప్పి చేస్తున్నారు!"

భేతాళుడు విసుక్కున్నాడు - "అప్పుడే హ్యూస్టన్ నగరంలో వున్నాం. నీ ఆవేశం ఆపి, నా ప్రశ్నకు జవాబు చెప్పు బాబూ - కొంపకు చేరే లోపల"అన్నాడు.

విక్రమార్కుడు అన్నాడు - "వస్తున్నా ... వస్తున్నా ... మొట్టమొదట జరగవలసింది - ప్రభుత్వం ఏవో కొన్ని రంగాల్లో తప్ప - దేశరక్షణ ప్లానింగ్, విదేశ రాజకీయాలు లాంటివి తప్ప - మిగతా ప్రతిచోట నించీ బయటకు పోవాలి. రేడియో, టీవీ, రైల్వేలు, విమానాలు, పరిశ్రమలు, బాంకులు, టెలిఫోన్లు - ప్రభుత్వం నడపడం పరమ బుద్ధి తక్కువ. పరిశ్రమలకు, వ్యాపారాలకు లైసెన్స్ విధానం, ఉత్పత్తి మీద ఆంక్షలు పూర్తిగా రద్దు అయిపోవాలి. ప్రస్తుతం నరసింహారావ్, మన్‌మోహన్‌సింగ్‌ల ప్రభుత్వం ఆ దారినే పోతున్నది. అదొక ఆశారేఖ. కానీ అది చాలదు. ఇంకా ఎంతో, ఎంతో త్వరగా జరగవలసి వుంది. సమ్మెలు, ఘెరావ్‌ల వలన దేశం వేగంగా వెనక్కి పోతుంది. వెనకబడి పోతుంది. అన్నిటికన్నా ముఖ్యం, ప్రతి మనిషీ దేశం తనదనీ, దేశ నిర్మాణంలో 'తన' బాధ్యత 'తను' నిర్వహించాలనీ ధృఢ నిశ్చయంతో పనిచేయాలి. మీ యింటి ముందు రోడ్డు మీద, మీరు చెత్త పోసి, ప్రభుత్వాన్ని శుభ్రం చేయలేదని తిట్టడం, బాధ్యతారహితమైన పని. ఆ ప్రభుత్వాన్ని ఎన్నుకోవటంలో కూడా బాధ్యత వహించాలి. ఎంతమంది ఓటు వేస్తున్నారు? దేశాన్ని మత రాజకీయాలతో, రాష్ట్రాన్ని కుల రాజకీయాలతో నడిపిస్తున్న లంచాల నాయకులను ఎన్నుకున్నదెవరు? ప్రజల చేతుల్లో ఏమీ లేదా? ఆంధ్ర రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తున్న కొన్ని వందల మంది రాజకీయ నాయకులను, ఎనిమిది కోట్ల ప్రజలు ఏమీ చేయలేరా? ఎన్నికలు వారికి ఎంత మహత్తరమైన అవకాశాలు యిస్తున్నాయి - ప్రజలలో, అమెరికన్ ప్రజలలోలాగా, ఆ అవేర్‌నెస్ రావాలి. నెగెటివిజం పోవాలి. బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. 'నేను - నా దేశం' అన్న గర్వం ఉండాలి. అప్పుడు భారతదేశం అమెరికాని మించిపోతుంది. అప్పుడు అక్కడ కూడా దేశాన్ని చూసి 'సొగసు చూడతరమా' అని పాడుకోవచ్చు!" అన్నాడు విక్రమరావ్ - కారుని తన యింటి డ్రైవ్‌వేలోకి పోనిస్తూ.

రిమోట్ కంట్రోల్‌తో గరాజ్ డోర్‌ని ఓపెన్ చేస్తూ, బేతాళుడి వైపు చూశాడు.

భేతాళుడు అప్పటికే మాయం అయి, ఎదురుగుండా వున్న 'రెడ్ ఓక్' చెట్టు మీద ఎక్కి కూర్చున్నాడు.

❖